

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో ఎదురెక్కిన గోదావరి జలాలతో సిరిసిల్ల మానేరు వాగు



మధ్యమానేరులో నీరు నింపకపోవడంతో ఎడారిగా మారిన సిరిసిల్ల మానేరు వాగు

నాడు జలకళ .. నేడు వెలవెల

# కరువు కోరల్లో సిరిసిల్ల

- కేసీఆర్ హయాంలో వాటర్‌హబ్
- నిండుకుండలా ప్రాజెక్టులు
- మండువేసవిలోనూ మత్తడి దుంకిన చెరువులు
- ఏకంగా ఐఏఎస్‌లకు పాఠ్యాంశంగా మారిన భూగర్భజలాలు
- పుట్లకొద్దీ వడ్లు పండించిన రైతులు
- కాంగ్రెస్ పాలనలో మళ్లీ పదేళ్ల కిందటి పరిస్థితులు
- అడుగంటిన జలవనరులు
- ఎండుతున్న పంటలు

**ఏడాదిన్నర కిందటి జలవనరులతో కళకళలాడిన సిరిసిల్ల గడ్డ ఇప్పుడు తల్లడిల్లుతున్నది. రోజురోజుకూ తీవ్రమవుతున్న సాగునీటి కష్టాలతో అల్లాడిపోతున్నది. కేసీఆర్ పాలనలో కాళేశ్వరం ఎత్తిపోతలతో మండువేసవిలోనూ మత్తళ్లు దుంకిన చెరువులు, కుంటలు.. నిండుకుండలా మారిన మధ్య, ఎగువ మానేరు జలాశయాలు.. నేడు వెలవెలబోతున్నాయి. మొన్నటిదాకా ఎటుచూసినా పుష్కలమైన జలాలతో సస్యశ్యామలమైన భూములు బీటలు వారుతున్నాయి. భూగర్భజలాలు ఏకంగా 6 మీటర్లకు చేరి ఒకనాడు ఐఏఎస్‌లకే పాఠ్యాంశమైనా.. ఇప్పుడు అదే భూగర్భజలాలు పాతాళానికి చేరి కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో సేద్యం తలకిందులు అవుతుండగా, అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.**



నీళ్లులేక ఎడారిని తలపిస్తున్న పెద్దూరు చెక్‌డ్యాం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల ప్రాంతానికి నాడు రెండు టీఎంసీల సామర్థ్యం ఉన్న ఎగువమానేరు ప్రాజెక్టు ఒక్కటే ఉండేది. వాన కాలం వరద నీరు ఆధారంగా నిండేది. మెట్ట ప్రాంతం కావడంతో సాగు అధ్వానంగా ఉండేది. రైతుల బాధలు ఎవరూ పట్టించుకునేవారు కాదు. ఈ క్రమంలో స్వరాష్ట్రంలో అధికారంలోకి వచ్చి, ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కేసీఆర్, అప్పటి మంత్రి కేటీఆర్ సిరిసిల్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాజరాజేశ్వర, అన్నపూర్ణ, మల్కపేట రిజర్వాయర్లను పూర్తి చేసి, సిరిసిల్లను వాటర్ హబ్‌లా మార్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతలతో రాజరాజేశ్వర జలాశయాన్ని కాళేశ్వరం ఎత్తిపోతలకు గుండెకాయలా మార్చారు. ఇక్కడి నుంచి ఇల్లంతకుంట మండలం అన్నపూర్ణ ప్రాజెక్టు.. అక్కడి నుంచి సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌కు నీటిని పంపించారు. అయితే, మల్లన్నసాగర్ నుంచి నీటిని వదిలి కూడెల్లి వాగు ద్వారా ముస్తాబాద్ మండలంలోని చెరువులతోపాటు గంభీరావుపేట మండలంలోని ఎగువమానేరు ప్రాజెక్టును నింపారు. మండుటెండల్లోనూ కాళేశ్వరం జలాలతో మానేరు వాగులు, చెరువులు మత్తళ్లు దూకించారు. ఒకప్పుడు 900 ఫీట్ల బోరు వేసినా నీళ్లు రాని బోర్ల నుంచి ఉబికివస్తున్న గంగమ్మను చూసి అన్నదాతలు మురిసిపోయారు. ఎటుచూసినా పుష్కలమైన జలాలతో రైతులు పుట్లకొద్దీ వడ్లు పండించారు. 2023లో భూగర్భ జలాలు ఒక్కసారిగా 6.38 మీటర్ల పైకి రాగా, ఈ అంశం ఐఏఎస్‌లకు పాఠ్యాంశంగానూ మారింది. అలా సిరిసిల్ల పుష్కలమైన జలరాశులతో అలరారింది.

> *దశాబ్దం కిందటి వరకు ఎండకాలం రాకముందే సిరిసిల్ల చెరువులు, కుంటల్లో చుక్కనీరుండేది కాదు.. మెట్టప్రాంతంగా ముద్రపడ్డ సిరిసిల్లలో వందల ఫీట్లు బోర్లు వేసినా నీళ్లు పడేవి కాదు.. రైతులు ఎవుసం సాగక అప్పుల పాలై ఉపాధి లేక ఉన్న ఊరును, కుటుంబాలను విడిచి దుబాయి, బొంబాయిలకు వలసబాట పట్టాల్సిన పరిస్థితి ఉండేది. స్వరాష్ట్రంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన చొరవ, అప్పటి మంత్రి కేటీఆర్ కృషితో సిరిసిల్ల మారిపోయింది. వ్యవసాయం పండుగలా మారింది. 60 వేల ఎకరాల సాగు మూడింతలకు పెరిగి ధాన్యం సిరులు కురిపించింది. కానీ, నేడు సాగునీరు లేక.. ప్రభుత్వం ప్రోత్సాహం లేక.. వ్యవసాయం భారంగా మారుతున్నది.*

## కేటీఆర్ చొరవతో సజీవ జలదృశ్యం

మెట్టప్రాంతమైన సిరిసిల్ల నియోజకవర్గంలో అప్పటి మంత్రి, ప్రస్తుత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక చొరవతో మెట్ట ప్రాంతానికి జలకళ వచ్చింది. ఇచ్చిన మాట మేరకు మల్లన్నసాగర్ పరిధిలోని తుక్కాపూర్ పంప్‌హౌస్ నుంచి కొండ పోచమ్మ కెనాల్ ద్వారా వెళ్తున్న నీటిని గజ్వేల్ మండలం కొడకండ్ల వద్ద కూడవెల్లి వాగులోకి వదిలారు. ఈ నీటితో గజ్వేల్, దుబ్బాక ప్రాంతాల్లో పలు చెక్‌డ్యాంలు, చెరువులు నింపారు. అక్కడి నుంచి ఇదే వాగు ద్వారా ఎగువమానేరు ప్రాజెక్ట్‌కు తరలించారు. నట్టెండకాలంలోనూ మత్తడి దుంకించి దిగువన చెక్‌డ్యాంలను నింపారు. అంతే కాకుండా, సిరిసిల్ల నియోజకవర్గంలోని చెరువులను నింపడంతో సజీవ జలదృశ్యం ఆవిష్కృతమైంది.



నిండు మండుటెండల్లో మత్తడి దుంకుతున్న సిరిసిల్ల అర్బన్ మండలం పెద్దూరు చెక్‌డ్యాం

## నేడు బోసిపోయిన ప్రాజెక్టులు

బీఆర్ఎస్ హయాంలో కళకళలాడిన ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు వెలవెలబోయాయి. వాగులన్నీ ఎడారిని తలపిస్తున్నాయి. ఫలితంగా జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోగా, చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయి. వరిని కాపాడుకునేందుకు అప్పులు చేసి బోర్లు వేసినా చుక్క నీరు పడకపోవడంతో తల్లడిల్లుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఎండిపోయిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు పాలనా వైఫల్యమే ఈ కరువుకు కారణమని, మధ్యమానేరు ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపకపోవడంతోనే భూగర్భజలాలు అడుగంటిపోయాయని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మధ్యమానేరులో 23టీఎంసీలు నిల్వ చేస్తే, కాంగ్రెస్ సర్కారు 9.85టీఎంసీలను మాత్రమే నిల్వ చేసింది. ఇంకా కాళేశ్వరం ఎత్తిపోతలు లేకపోవడం, మల్లన్నసాగర్ నుంచి నీటిని విడుదల చేసి ఎగువమానేరు, చెరువులను నింపకపోవడమే కరువుకు కారణమని రైతులు మండిపడుతున్నారు.

> *సిరిసిల్ల దశాబ్దం కిందటి వరకు మెట్ట ప్రాంతం.. ఉమ్మడి పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడ్డ ప్రాంతం.. సాగునీటికే కాదు, తాగునీటికి తండ్లాడిన ప్రాంతం. ఎటుచూసినా ఎడారిని తలపించిన ప్రాంతం.. కానీ స్వరాష్ట్రంలో అపరభగీరథుడు కేసీఆర్ కృషితో గోదావరి పరవళ్లు తొక్కుతూ మానేరు ఒడికి చేరింది. ఎగువ మానేరును నింపింది. సాగునీటి గోస తీరి సస్యశ్యామలంగా మారిపోయింది. ఏడాదిన్నరలో మళ్లీ పదేళ్ల కిందటి దుర్భిక్ష పరిస్థితులు ఉత్పన్నమవుతుండగా, జిల్లా తల్లడిల్లుతున్నది.*

## పదేళ్లలో గింత గోసపడలే



పదేండ్ల కేసీఆర్ పాలనలో సాగునీళ్లకు తండ్లాడలేదు. రైతు బిడ్డ కేసీఆర్ ముఖ్యమంత్రి కాబట్టి మాగోస తెలిసి నోడాయే. సిరిసిల్ల మానేరువాగులో గంగమ్మ గుడి దాక నీళ్లు నింపిండు. ఎండకాలంలో బోరు చాలు చెయ్యంగనే నీళ్లు పైకి వచ్చేవి. మాఒక్క బోరు అయిదెకరాలు పారింది. పోయినేడు మంచిగున్నయని ఈయేడు యాసంగిలో సాగు చేసిన. వాగులో నీళ్లు గుంజేసిన్రు. బోర్లన్నీ ఇంకిపోయినయ్. నీళ్లు లేక ఈనిన వరి ఎండిపోతుంటే సూడలేక వాటర్ ట్యాంకులు తెచ్చి పోత్తున్న. ఒక్కో ట్యాంకర్‌కు ₹800, రోజుకు పది ట్యాంకర్లు పెట్టిపారిత్తున్న. ఇప్పటికే నీళ్లకు ₹80వేలు పెట్టిన. సారు పోయినంక ఇంత కష్టమొచ్చింది. సారు వత్తనే మళ్లనీళ్లు సూత్తం.

**- హనుమయ్య, రైతు (తాడూరు)**

## పెట్టబడి ఎల్లదన్న నమ్మకం లేదు



అప్పుడు కేసీఆర్ పుణ్యమా అని కాళేశ్వరంతో మాఊరిలోని చెర్లు, కుంటల్లో నీళ్లు బర్‌పూర్ ఉండె. పదేళ్ల కాలంలో యాసంగిలో అలుగులు దూకినయి. నాకున్న అయిదెకరాల్లో ఏసిన వరితో 80 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. ఈ యాసంగిలో నీళ్లకు బాగా తిప్పలు పడ్డం. చెర్లు, కుంటల్లో నీళ్లలేవు. బోర్లన్నీ దగ్గరపడ్డయి. మడులు తడవలే. ఆశించిన దిగుబడి వత్తదో రాదోనన్న రందే. పెట్టబడి ఎల్లదన్న నమ్మకం లేదు. రంగనాయక సాగర్ నుంచి మావూరికి కాలువ తీత్తమన్నరు. ఏడాదిన్నర గడిసింది. ఇంకా జాడేలేదు. కాలువ అత్తనే మా పొలాలు పచ్చగుంటయి.

**- పలుమాల రవి, రైతు (రామోజీపేట)**

# కులరాజకీయాలు సిగ్గుచేటు

- సంక్షేమ పథకాల మంజూరు కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మెట్‌పల్లి టౌన్, ఏప్రిల్ 1: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులైన ఓట్ల కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కులాలతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెట్‌పల్లి పట్టణంతోపాటు మండలం, ఇబ్రహీంపట్నం మండలాల్లోని 106 మం ది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు మంజూరు కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని, ఎవరైనా అడిగితే తగిన బుద్ధి చెప్పాలన్నారు. నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు సంక్షేమ పథకాలు మంజూరు చేయిస్తామని డబ్బులు తీసుకున్నారని, అయినా నేటికీ పథకాలు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఎవరికీ డబ్బులు ఇవ్వొదన్దిని, అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఏమైనా సమస్యలుంటే నేరుగా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కుల రాజకీయాలు చేసే పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు బంగారు కాళ్ల కిషోర్, చంద్రశేఖర్‌రావు, నాయకులు పుల్ల జగన్‌గౌడ్, ఓజ్జెల శ్రీనివాస్, గడ్డం రాంరెడ్డి, గడ్డం రాజారెడ్డి, చెప్పాల రాజం, తదితరులు పాల్గొన్నారు.




# మెరుగైన కూలీ ఇవ్వండి

- మా సమస్యలు పరిష్కరించండి
- సిరిసిల్ల నేతన్నల డిమాండ్
- మరమగ్గాల నిరవధిక బంద్ మొదటిరోజు విజయవంతం


సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నేతన్న చౌరస్తాలో ధర్నా చేస్తున్న నేతన్నలు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్1 (నమస్తే తెలంగాణ) : తమ సమస్యలు పరిష్కరించాలని, కార్మికులకు మెరుగైన ఉపాధి చూపాలని, కూలీ అందించాలని సిరిసిల్ల నేతన్నలు డిమాండ్ చేశారు. మానం కాపాడే నేతన్నల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ జీవితాలతో చెలగాటమాడుతున్నదని మండిపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన మరమగ్గాల నిరవధిక బంద్ మొదటి రోజు మంగళవారం విజయవంతం కాగా, మరమగ్గాల కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీవైనగర్ కార్యాలయం నుంచి నేతన్న చౌక్వరకు భారీ ర్యాలీ తీసి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడారు. ప్రభుత్వ విధానాల వల్ల పనిలేక కార్మికులు చనిపోతే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న వస్త్ర ఉత్పత్తులకు మెరుగైన కూలీ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రభుత్వం జోక్యం చేసుకొని చర్చలు జరిపి కూలీ నిర్ణయించి సమ్మెను విరమింపజేయాలన్నారు. లేదంటే సమ్మెను ఉధృతం చేస్తామని, బుధవారం కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణేశ్, గుండు రమేశ్, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సత్యం, కిషన్ పాల్గొన్నారు.



కరీంనగర్: మల్టీపర్పస్ స్కూల్ పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మ్యూజికల్ ఫౌంటేన్ (ఇన్‌సెట్)

# ప్రజలకు ఆహ్లాదం కోసమే పార్కులను అభివృద్ధి చేశాం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 1 : అందరికీ అందుబాటులో ఉండాలన్న ఆలోచనతోనే నగరం నడిబొడ్డున మల్టీపర్పస్ స్కూల్ పార్కును అద్భుతంగా తీర్చిదిద్దామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కరీంనగర్‌లోని మల్టీపర్పస్ స్కూల్ పార్కులో మ్యూజికల్ ఫౌంటేన్ పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్న కేసీఆర్ ఆలోచనకు అనుగుణంగా అప్పటి ఎంపీ వినోద్‌కుమార్ తాను కలిసి ప్రణాళికతో పార్కును అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. స్మార్ట్‌సిటీ కింద ఈ పార్కుతో పాటు సర్కస్‌గ్రౌండ్ పార్కును సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు అందించామని చెప్పారు. దక్షిణ భారతంలోనే అద్భుతమైన ప్రాజెక్టు మానేరు రివర్ ఫ్రంట్‌ను చేపట్టామన్నారు. ఈ ప్రాజెక్టులను ప్రస్తుత ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాలని, అలా చేస్తే ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుందని సూచించారు. బీఆర్ఎస్ తీసుకొచ్చిందన్న కారణంతో పనులు పూర్తి చేయకపోతే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని చెప్పారు. ఏ ప్రభుత్వమైనా ప్రజల కోసమే పనిచేస్తుందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో నగరంలో ఈ రెండు పార్కులను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు సాగర్, వాల రమణారావు, మహేశ్, తోట రాములు, బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల అశోక్, గందె మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

# రైతుభరోసాపై రేవంత్‌ది పూటకో మాట

- రైతుల ఖాతాల్లో వెంటనే జమచేయాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 1 : రాష్ట్రంలో రైతుభరోసా విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి పూటకో మాట చెబుతూ రైతులను ఏప్రిల్ ఫూల్ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను మోసం చేస్తున్నదని విమర్శించారు. కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి రైతుభరోసాను ఓసారి సంక్రాంతికి వేస్తామని, మరోసారి జనవరి 26న వేస్తామని చెప్పారని గుర్తు చేశారు. మొన్న మార్చి 31 నాటికి రైతుల ఖాతాల్లో వేస్తామని చెప్పినా ఇప్పటి వరకు పడలేదన్నారు. రైతులకు నాట్ల సమయంలో ఇవ్వాల్సిన పెట్టుబడిని ఇప్పుడు పంటలు కోతకు వచ్చినా ఇవ్వడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులున్నా.. కరోనా కష్టకాలం వచ్చినా.. రైతులకు సకాలంలోనే రైతుబంధు ఇచ్చామని గుర్తు చేశారు. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం రేపు, మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. తప్పుడు ప్రచారాలు, అబద్ధాలతో అధికారం కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఓవైపు రైతులకు సాగునీరు సకాలంలో అందించక ఇప్పటికే పొలాలను ఎండబెట్టారని, సన్నవడ్లకు బోనస్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. రైతు రుణమాఫీ చేశామని చెప్పుకుంటున్నా ఇంకా అనేక మంది రైతులకు అందించలేదన్నారు. కనీసం రైతుభరోసా అయినా సక్రమంగా అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, చొప్పదండి బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కరీంనగర్: యూనివర్సిటీ ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

# హెచ్‌సీయూ భూముల జోలికొస్తే ఊరుకోం

- విద్యార్థి సంఘాల నాయకుల హెచ్చరిక
- కరీంనగర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 1 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల కోసం విద్యార్థి సంఘాల నాయకులు కదులుతున్నారు. హెచ్‌సీయూ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు 400 ఎకరాల వేలం నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలిపారు. బీఆర్ఎస్వీ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌యూ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, నగర అధ్యక్షుడు బొంకూర్ మోహన్ మాట్లాడుతూ, యూనివర్సిటీ భూముల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని, రోడ్లమీద తిరగనిచ్చేదిలేదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి మొదటి నుంచీ విద్యా విధానాలకు వ్యతిరేకంగా చేస్తున్నారని మండిపడ్డారు. విలువైన భూములను బడా వ్యాపారవేత్తలకు కట్టబెట్టడం కోసం ఆయన రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే విశ్వవిద్యాలయాల భూములు అమ్మడమేనా..? అని ప్రశ్నించారు. విద్యార్థులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి, విద్యార్థుల సమస్యలు పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. అరెస్ట్ అయిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని, హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నారదాసు వసంతరావు, వొడ్నాల రాజు, బీఆర్ఎస్వీ ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యక్షుడు నాయిని అన్వేశ్, సీనియర్ నాయకులు బోడ ఆంజనేయులు, మామిడిపల్లి సాయి, శనిగరం సతీశ్, సయ్యద్ సోహెల్, బద్దం ప్రవీణ్ రెడ్డి, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.